

ఎంపిపి విజయలక్ష్మిపై దాడికి ఖండన

ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన కాకినాడ జిల్లా రౌతులపూడి ఎంపిపి విజయలక్ష్మిపై దాడిని ఏలూరు జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు. మండల ప్రథమ పౌరురాలు, అందులోను ఒక మహిళపై ఈ విధంగా దాడి చేయడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. పిహెచ్‌సి ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించకపోగా ప్రశ్నించిన ఎంపిపి విజయలక్ష్మిపై దాడికి పాల్పడటం సరికాదని అన్నారు. దాడి చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మళ్లీ తవ్వకాల జాతర

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఆక్వా చెరువుల తవ్వకాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. అనుమతులున్నా.. లేకున్నా చెరువుల తవ్వకాలు యథావిధిగా సాగుతున్నాయి. సరిహద్దు రైతులు, సమీప నివాసితులు, గ్రామస్తులు అభ్యంతరాలు చెబుతున్నా చెరువుల తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. దీంతో మండలంలో ఆక్వా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుండగా వ్యవసాయ భూములు మాత్రం కనుమరుగవుతున్నాయి. బడాబాబులు ధనార్జనే ధ్యేయంగా బరితెగించి మరీ అక్రమ చెరువుల తవ్వకాలు చేపడుతున్నారు. మండలంలో కాకరవాడ పంచాయతీ శివారు దేవరం రెవెన్యూ ఆయకట్టు పరిధిలో సుమారు 60 ఎకరాల్లో చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయి. భూమి ఆయకట్టు ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో ఉండగా సాగుదారులు మాత్రం కృష్ణా జిల్లాలో ఉన్నారు. చెరువుల తవ్వకాలు మాత్రం చినగొన్నూరు, పురిటిపాడు అనే రెండు దళిత గ్రామాల ఇళ్ల సమీపంలో సాగుతున్నాయి. గతంలో చెరువులు తవ్వరాదంటూ పలుసార్లు ఉన్నతాధికారులకు ఆ రెండు గ్రామాల దళితులు, సరిహద్దు రైతులు ఫిర్యాదు చేశారు. అయినా వాటిని పట్టించుకోకుండా అధికారులు చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇచ్చారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బుధవారం చెరువుల తవ్వకాలకు పొక్లెయిన్లు రాగా గ్రామస్తులు, రైతులు వాటిని అడ్డుకుని వెనక్కి పంపేశారు. దీంతో ఐదు రోజులపాటు రెవెన్యూ అధికారులు చెరువులు తవ్వకుండా పనులు నిలుపుదల చేయించారు. తమకు చెరువులు తవ్వుకునేందుకు అనుమతులు ఉన్నాయంటూ తవ్వకందారులు ఈ నెల 12న స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో మంతనాలు జరిపారు. దీంతో తహశీల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం మండల మత్స్యశాఖ అధికారి సతీష్‌కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, మండల సర్వేయర్ రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రాంతానికి వెళ్లి దళితులతో, సరిహద్దు రైతులతో చర్చలు జరిపి, కోర్టు ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం పెగ్ మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల దళితులు మాట్లాడుతూ చెరువుల తవ్వకాలు కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతాయన్నారు. దీంతో వ్యవసాయ పనులు లేక తాము ఊరు విడిచి వలసలు పోవాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల వల్ల పశువులకు మేత లేక పశువులను కబేళాకు అమ్ముకోవాల్సి వస్తోందంటున్నారు.

దేవరం ఆయకట్టులో చెరువులు తవ్వుతున్న పొక్లెయిన్

ఆక్వా చెరువులుగా పచ్చని పంట చేలు

అభ్యంతరాలున్నా పట్టించుకోని అధికారులు

చెరువులతో మాకు చేటు అంటున్న దళితులు

చెరువుల తవ్వకాలతో చెరువుల్లో చల్లే రసాయనాల కారణంగా, చచ్చిన చేపల వల్ల వచ్చే దుర్గంధంతో తాము రోగాలు బారిన పడే అవకాశం ఉందంటున్నారు. అధికారులు కనీసం క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా, తమకు సమాచారం ఇవ్వకుండా ముడుపులు తీసుకుని చెరువుల అనుమతికి సిఫార్సు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వ్యవసాయ, మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులే చెరువుల తవ్వకాలకు అనుమతుల్లో చక్రం తిప్పుతున్నారని దళితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు చెరువుల తవ్వకాలు నిలుపుదల చేయాలంటూ సరిహద్దు రైతులు, రెండు గ్రామాల దళితులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి

సతీష్‌కుమార్, మత్స్యశాఖాధికారి

చెరువులు తవ్వే ప్రాంతం ఆక్వాజోన్ పరిధిలో ఉంది. అందుచేత చెరువుల తవ్వకాలకు అనుమతులిచ్చాం. అనుమతులు లేకుండా ఎవరైనా చెరువులు తవ్వితే చర్యలు తీసుకుంటాం. ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందే.

ఐసెట్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు

ప్రగడవరం విద్యార్థికి 6వ ర్యాంకు - కవిటం విద్యార్థినికి 10వ ర్యాంకు

ఐసెట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన అఫ్తాబుద్దీన్ రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించగా, పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన అంబళ్ల మహాలక్ష్మి పదో ర్యాంకు సాధించింది.

ప్రజాశక్తి - చింతలపూడి

ఐసెట్ 2023 పరీక్షా ఫలితాల్లో చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్తాబుద్దీన్ రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. ప్రగడవరానికి చెందిన ఉపాధ్యాయిని షేక్ ఖాదర్‌బీ పెద్ద కుమారుడు మహ్మద్ అఫ్తాబుద్దీన్ చిన్నతనం నుంచి చదువులో ముందుండేవాడు. పదో తరగతి వరకు చింతలపూడిలో చదువు కొనసాగించి అనంతరం ఇంటర్ విజయవాడలో పూర్తి చేశారు. భవిష్యత్తులో ఎంబిఎ పూర్తి చేసి ఐఐటిలో ప్రాజెక్టు డైరెక్టర్ మేనేజర్‌గా చేయాలనేది తన లక్ష్యమని అఫ్తాబుద్దీన్ తెలిపారు. తన కుమారుడు రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించడంపై అఫ్తాబుద్దీన్ తల్లి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఫ్తాబుద్దీన్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.**పాలకొల్లు:**పోడూరు మండ లం కవిటంకు చెందిన అంబళ్ల మహాలక్ష్మి ఐసెట్‌లో 10వ ర్యాంకు సాధించింది. గతేడాది కూడా ఆమెకు 38వ ర్యాంకు వచ్చింది. అయితే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో ఎంబిఎలో చేరలేదు. 4 నెలల పాటు ఉద్యోగం చేసిన మహాలక్ష్మి ఉద్యోగం మానేసి ఎంబిఎ చేయాలని మరలా చదివి ఈ సారి 10వ ర్యాంకు సాధించింది. తల్లి శ్యామలాదేవి గృహిణి, తండ్రి సత్యకుమార్ ఎన్‌సిసిలో ప్రయివేటు ఇంజినీర్‌గా పనిచేసిన రెండేళ్ల క్రితం మృతి చెందారు. అయితే తండ్రి ఉద్యోగం రీత్యా ఆమె చిన్నతనంలో పలు పాఠశాలల్లో విద్యాభ్యాసం చేయాల్సి వచ్చింది. మహాలక్ష్మి 1, 2, 3 తరగతులు హైదరాబాద్, కడపలో, 4, 5 కవిటంలో, 6వ తరగతి తాళ్లపూడిలో, 7 నుంచి 10వ తరగతి వరకూ నెల్లూరులో చదివింది. ఇంటర్, డిగ్రీ పాలకొల్లులోని ఆదిత్య కళాశాలలో చదివింది.

అఫ్తాబుద్దీన్

అంబళ్ల మహాలక్ష్మి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని..

తాను మంచి కళాశాలలో ఎంబిఎ చేస్తానని మహాలక్ష్మి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాసి ఇన్ కం టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తన చెల్లెలు బిటెక్ చదివి పోస్ట్ మాస్టర్‌గా పేరుపాలెంలో పనిచేస్తోందని, తమ్ముడు 9వ తరగతి చదువుతున్నట్లు చెప్పారు. తనకు తాతయ్య భాస్కరరావు, నానమ్మ అప్పాయమ్మ (మాజీ సర్పంచి) స్ఫూర్తి అని చెప్పారు.

పెంచిన ఛార్జీలను ఉపసంహరించకపోతే మరో విద్యుత్ ఉద్యమం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ట్రూఅప్, సర్దుబాటు విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు తగ్గించాలని ఆందోళన చేపట్టారు. మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవి మాట్లాడుతూ కరెంటు బిల్లుల పేరుతో జనాన్ని అంధకారంలోకి నెట్టేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ విధానాలను విడనాడాలని అన్నారు. ప్రజల కళ్లుగప్పి దొడ్డిదారిన సర్దుబాటు ఛార్జీల భారం మోపుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లతో మరో ముప్పు రాష్ట్రానికి ఏర్పడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రజలంతా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. వేసవి ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతుంటే విద్యుత్ కోతలతో మరింత అల్లాడుతున్నారని తెలిపారు. ఈ నెల విద్యుత్ బిల్లులు చూడగానే జనానికి నిజంగా విద్యుత్ షాక్ కొట్టిందని ఎద్దేవా చేశారు. విద్యుత్ రంగాన్ని అదానీ తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. తక్షణమే సర్దుబాటు ఛార్జీల విధానం రద్దు చేయాలని, అదనపు వసూళ్లు నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టకుండా ఆపాలని డిమాండ్ చేసారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, నేతలు ఎస్‌కె.సుభాషిణి, వి.గోపి, ఎస్‌కె.మాబుసుభాని, నాయుడు వెంకటేశ్వరరావు, జి.సూర్యకిరణ్, బొడ్డు రాంబాబు, అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, రాయల దుర్గారావు, గరికి రాంబాబు, కె.స్టాలిన్ పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

జంగారెడ్డిగూడెంలో..

ఏలూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మూడు రకాల సర్దుబాటు ఛార్జీల పేరుతో కరెంటు ఛార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం సిపిఎం ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ భవన్ (ఎస్‌ఇ కార్యాలయం) వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కళ్లుగప్పి దొడ్డిదారిన సర్దుబాటు పేరుతో కరెంటు ఛార్జీలు పెంచుతుందని విమర్శించారు. సామాన్య ప్రజలను దోచి కార్పొరేట్ సంస్థల జేబులు నింపుతుందని విమర్శించారు. వైసిపి ఎన్నికల్లో 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. అప్పటికే ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలవుతున్నా దాన్ని సైతం ఎత్తివేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రజలపై రూ.1400 కోట్లు కరెంటు చార్జీల భారం వేసిందని, ప్రస్తుతం సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.ఆరు వేల కోట్లు భారం మోపిందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విద్యుత్ సంస్థలను అదాని వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం వల్లే ఈ రకంగా ధరలు పెరుగుతున్నాయన్నారు. విదేశాల నుండి బొగ్గు సరఫరా చేసేది, బొగ్గు రవాణా చేసే ఓడరేవులు అదానివేనన్నారు. తాజాగా స్మార్ట్ మీటర్లు తయారు చేసే కాంట్రాక్టు సైతం అదానికే ఇచ్చారని అన్నారు. అదానికి విద్యుత్ సంస్థలు కట్టబెట్టడంలో భారీ అవినీతి చోటు చేసుకుంటుందని, దానిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల ఆలోచన విరమించుకోవాలని, పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల ఉచిత విద్యుత్‌కు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ధర్నాలో సిపిఎం నాయకులు వి.సాయిబాబు, వివిఎన్.ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ, జి.ఏసుబాబు, జి.కోటేశ్వరరావు, గౌడ రవీంద్ర, ఆర్.నరసింహమూర్తి, సిహెచ్ సీతయ్య, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఏలూరులో..



పోస్టర్ ఆవిష్కరించిన సిపిఎం జిలా కార్యదర్శి రవి, నేతలు

నిర్వాసితుల మహాపాదయాత్రను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నిర్వా సితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి జులై 4 వరకు నెల్లిపాక నుండి విజయవాడ వరకు నిర్వహించనున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో పోలవరం నిర్వాసితుల పోరు కేక మహాపాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నెల్లిపాక నుండి విజయవాడ వరకు 15 రోజుల పాటు 400 కిలోమీటర్లకుపైగా సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, గోదావరి వరదల నుండి నిర్వాసితులను రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపటాలని కోరారు. 1986-2022 మధ్యకాలంలో గోదావరి వరదలకు మునిగిన గ్రామాలను మొదటి దఫాలో చేర్చి పరిహారం ఇవ్వాలని, కాంటూరు లెక్కలు మార్చాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు కేంద్రాల్లో సరైన వసతులు లేవని, ప్రభుత్వాలు తక్షణమే సదుపాయాలు కల్పించాలని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ప్రతి నిర్వాసిత కుటుంబానికీ కాంటూర్లకు సంబంధం లేకుండా రూ.10.50 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పెళ్లయిన వారికి కూడా ఆడపిల్లలకు ప్యాకేజి ఇవ్వాలని అన్నారు. నిర్వాసితులను తరలించిన ప్రాంతాల్లో ఉపాధి చూపాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మహా పాదయాత్రకు అంతా సహకరించాలన్నారు. ఈ నెల 26న జిల్లాలోని రుద్రమ్మకోటకు పాదయాత్ర వస్తుందని, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా విజయవాడ యాత్ర వెళ్తుందని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ వివరించారు. పోలవరం నిర్వాసితులు పోడు భూముల హక్కు పట్టాల కోసం, ఎల్‌టిఆర్, 1/70 చట్టం భూములను సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మరో పాదయాత్ర పోలవరం నుంచి బుట్టాయగూడెం చేరుకుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నేతలు తామా ముత్యాలమ్మ, పోలోజు నాగేశ్వరరావు, కె.భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల ధర్నాలు

బుట్టాయగూడెంలో

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు అనేక రెట్లు పెరిగాయన్నారు. అయితే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని, 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఏప్రిల్ 25న సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాడ్యూటీ అమలు చేయాలని చెప్పినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి పని భారం పెంచారు తప్ప సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. కనీస వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం ఐసిడిఎస్ అధికారికి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే జులై 10, 11 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరవధిక ఆందోళన చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి వివిఎస్.కృపామణి, నేతలు కె.పుష్ప, టి.రామలక్ష్మి, ఎస్తేరు, భూదేవి, రాధాకుమారి పాల్గొన్నారు.

ఏలూరు: సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి అంగన్వాడీ జిల్లా నాయకులు పి.హైమావతి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలైనా అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోగా ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించేందుకు యత్నిస్తోందన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగినా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనం ఇవ్వాలని, రెండు నెలల జీతం బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ టిఎ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. హెల్పర్ల ఉద్యోగోన్నతుల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు టౌన్ కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ జులై పదో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు టి.రజిని, భవాని, సెక్టార్ లీడర్లు సిహెచ్.ఆందోళనమ్మ, టి.సుకన్య, జి.విజయలక్ష్మి, బి.కనకదుర్గ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి: అంగన్‌వాడీలకు తెలంగాణా కంటే వేతనం ఎక్కువ ఉండేలా పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సరోజిని కోరారు. ఈ మేరకు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం సిడిపిఒ మాధవికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నేతలు టి.మాణిక్యం, బిఎన్.కుమారి, ఎం.పద్మ, జి.సరళ, డి.హేమలత, సిహెచ్.శాంతి, ఈశ్వరి, ఎం.అరుణకుమారి, కవిత, మార్తమ్మ, చెన్నకేశ్వరి, శ్యామల, ఆయమ్మలు రజియా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏలూరులో..

ఉపాధి కూలీలకు పే స్లిప్‌లు, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

ఎపి వ్యకాస జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ

ప్రజాశక్తి - లింగపాలెం

ఉపాధి పని ప్రదేశంలో కనీస సౌకర్యాలైన మెడికల్ కిట్, టెంట్, పనిముట్లు, మజ్జిగ, తాగునీరు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో భోగోలు, రంగాపురం, మడిచర్ల గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను పర్యటించామని, ఆయా ప్రాంతాల్లో కూలీలకు కనీస అవసరాలైన తాగునీరు, మజ్జిగ, టెంట్, మెడికల్ కిట్ సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే వేసవి అలవెన్స్ రద్దు చేసి కూలీలకు రావాల్సిన వేతనాలను తగ్గించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, ఉపాధి హామీ పనిపై ఆధారపడి జీవించే కుటుంబాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ నేషనల్ మొబైల్ మోనిటరింగ్ ఫొటో సిస్టమ్ తీసుకొచ్చిందని, దీనివల్ల ఫొటోలు పడక మస్టర్ సరిగా లేకపోవడం వల్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెట్ సౌకర్యం లేని గ్రామాల్లో నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, మేట్ల వ్యవస్థను అభివృద్ధి చేసే చట్టాన్ని కాపాడాలని కోరారు. చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాబోయే కాలంలో ఈ చట్టం పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం పెద్దఎత్తున పోరాటాలకు సన్నద్ధమవుతుందని, దానిలో ఉపాధి కార్మికులంతా పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న పివి.రామకృష్ణ

రహదారిని ఆక్రమించిన పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చర్యలు

ఎన్‌హెచ్ డిఇ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జాతీయ రహదారి మార్జిన్లను ఆక్రమించిన పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని నేషనల్ హైవే డిఇ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక శ్రీనివాసపురం రోడ్డు జంక్షన్ బైపాస్ రోడ్డు మార్జిన్ ఆక్రమించి నిర్మాణం చేపట్టిన దాక్షాయణి ఇండియన్ పెట్రోల్ బంక్ ఆక్రమణలను నేషనల్ హైవే డిఇ ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జీలుగుమిల్లి-దేవరపల్లి జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 516డి) మార్జిన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఐఓసిఎల్ ఔట్‌లెట్ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఇటీవల రహదారి ఆక్రమించి పెట్రోల్ బంక్ యాజమాన్యం అక్రమ నిర్మాణం చేపట్టడంపై స్థానికులు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు మార్జిన్ ఆక్రమించిన పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. జాతీయ రహదారి వైపు పెట్రోల్ బంకు నిర్వహణకు ఎటువంటి అనుమతులూ లేవని గుర్తించామన్నారు. వెంటనే రహదారి ఆక్రమణలు తొలగించాలని యాజమాన్యాన్ని హెచ్చరించినట్లు తెలిపారు. వారం రోజుల్లో రహదారి ఆక్రమణలు తొలగించని పక్షంలో తామే స్వయంగా తొలగింపు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ డిఇ ఎం.శ్రీనివాసరావుతోపాటు ఎఇ సబీర అహ్మద్, డివైఎఫ్ఐ నాయకులు జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్, బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ కోరుతూ మున్సిపల్ కార్మికుల ధర్నా

నినదిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, మున్సిపల్ కార్మికులను సచివాలయాలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి రాక ముందు తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పారని, అయితే అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైనప్పటికీ రెగ్యులర్ చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ తీసుకొస్తామన్నారని, అయితే ఇచ్చిన హామీని మరిచి కార్మికులను మోసగించారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ కార్మికులను సచివాలయాలకు అప్పగించడాన్ని వ్యతిరేకించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, ఇంజినీరింగ్ వర్కర్లకు రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు, నేతలు జార్జి, పంతం నాగరాజు, జయకర్, బంగారు వెంకటేశ్వరరావు, హనుమంతు, ఏసురత్నం, సిహెచ్.మరియమ్మ, వి.మల్లిక, జి.నిర్మల, ఎం.చిన్ని, ఎ.మహేశ్వరిదేవి పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాల్లో అనధికార లే అవుట్లను గుర్తించి వాటిలో హెచ్చరిక బోర్డులు ఉంచి ఫొటోలు తీసి ఈ నెల 20వ తేదీలోపు పంచాయతీ కార్యదర్శులు రిపోర్టు చేయాలని పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ అన్నారు. ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఉంగుటూరులో అక్రమ లేఅవుట్లపై ప్రజాశక్తిలో వార్తలు ప్రచురితమైన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అనధికార లేఅవుట్లపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. మండలంలోని గ్రామాల వారీగా అనుమతులు లేని ఇళ్ల స్థలాల లేఅవుట్ల వివరాలు, సంబంధిత భూ యజమానులకు నోటీసులు, తదితర వ్యవహారాల వివరాలను అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి జూన్ 22వ తేదీ వరకు గ్రామ సర్పంచి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, కార్యదర్శులు ఇంటింటా పర్యటించాలని చెప్పారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలను సేకరించి వారందరికీ న్యాయం చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉర్లగూడెం సర్పంచి యువరాజు అన్నారు. గురువారం సర్పంచి యువరాజు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ఉర్లగూడెంలో ఎంపిపిఎ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించి, మౌలిక వసతుల అభివృద్ధికి నగదు సాయం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి యువరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో విద్యార్థులకు అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. నాడునేడు ద్వారా గ్రామాల్లో పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, స్కూల్ పూర్వ విద్యార్థులు రామకృష్ణ, కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురం కాలేజీతో పాటు చేబ్రోలు, గోపీనాథపట్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రిజమ్ జాన్సన్ లిమిటెడ్ నిర్వాహకులు (నారాయణపురం టైల్స్ ఫ్యాక్టరీ) సిఎస్ఆర్ నిధులతో గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రిజమ్ జాన్సన్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సమీర్ రంజన్ జన, హెచ్‌ఆర్ హెడ్ టి.ఈశ్వర్, కళాశాలల అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రతి ఏటా పలు గ్రామాల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందని పరిశ్రమ నిర్వాహకులు వెల్లడించారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తుక్కులూరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఎంపిడిఒ విజయకుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. సిబ్బంది హాజరు, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన పలు దస్త్రాలను పరిశీలించారు. నవరత్నాల అమలు, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వినియోగం తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గురువారం ఘనంగా సన్మానించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి మెడల్, ప్రశంసాపత్రాలు అందించారు. వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాధికారాణి, సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యులు లెనిన్, విద్యా కమిటీ ఛైర్మన్ వల్లూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పి.రవీంద్ర, నాగిరెడ్డి, మల్లేశ్వరి, కోటేశ్వరమ్మ సౌజన్య పాల్గొన్నారు.

బాధితులకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - టి.నరసాపురం

బొర్రంపాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను తిరుమలదేవిపేటలో టిడిపి నాయకులు గురువారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సంఘటన స్థలంలో బాధితులకు సేవలందించిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల టిడిపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పరామర్శించినవారిలో మాజీ శాసనసభ్యులు గంటా మురళీ రామకృష్ణ, మొడియం శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి, మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్, గంటా సతీష్, పాపాచార్యులు వీరేశలింగం, పెండ్యాల ప్రసాద్, పెద్దిన చంద్రశేఖర్, గ్రామ పెద్దలు సాధనాల నరసింహరావు ఉన్నారు.

'టిడిపితోనే ప్రజలకు భవిష్యత్తు'

ప్రజాశక్తి - చాట్రాయి

ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారంటీ ఇచ్చేది టిడిపి ఒక్కటేనని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో గురువారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చాక నూజివీడు నియోజకవర్గ పరిధిలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పేదలకు నూతన గృహ నిర్మాణానికి కావాల్సిన చర్యలు చేపడతామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల్లో కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందిస్తామన్నారు.

విద్యాకానుక కిట్లు అందజేత

కలిదిండి :ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి పి.భోగేశ్వరరావు అన్నారు. మండలంలోని అమరావతి ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఎఎస్ఎన్.బెనర్జీ తెలిపారు. పిఎంసి ఛైర్మన్ సిహెచ్.వినోద్, ఎన్.తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఎస్.ఝాన్సీ, వై.రాజేంద్రప్రసాద్, పిఎంసి సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వెంకటాపురంలో మూడు తాటాకిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని వెంకటాపురం గ్రామంలో మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఇళ్ల సమీపంలోని ఖాళీ స్థలంలో చెత్తకు నిప్పు పెట్టడంతో తాటిచెట్టుకు మంటలు అంటుకున్నాయి. ఆ మంటలు రెండు మూడు తాటిచెట్లకు వ్యాపించాయి. నిప్పురవ్వలు తాటాకిళ్లపై పడడంతో మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో పేరం కొండయ్య ఇంట్లో మోటార్‌సైకిల్‌తో పాటు రెండు కాసుల బంగారం, పోరం సత్యనారాయణకు చెందిన ఇంట్లో కాలనీ ఇళ్ల కోసం ఉంచిన రూ.లక్ష నగదు కాలి బూడిదయ్యాయి. పేరం దుర్గకు చెందిన ఇంట్లో రెండుకాసుల బంగారం కాలిపోయింది. మూడు కుటుంబాలవారు కట్టుబట్టలతో మిగిలారు. సమచారం అందుకున్న కైకలూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటాన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచన.

చెరువులో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రమాదవశాత్తూ బాలుడు చేపల చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఇంగిలంపాకలంకలో చోటు చేసుకుందని చోటు చేసుకుంది. మండవల్లి ఎఎస్ఐ కాకోళ్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం... గుడివాడ మండలం బేతవోలుకు చెందిన షేక్ నవీన్‌బాబుకు రాణికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఏడు నెలల క్రితం ఇద్దరు విడిపోగా పిల్లలు రాణితోనే ఉంటున్నారు. సానరుద్రానికి చెందిన కనగల శ్రీనుతో రాణికి పరిచయం ఏర్పడింది. రాణి శ్రీనుతో సహజీవనం చేస్తూ ఆనందపురం వద్ద ఇంగిలిపాకలంక వెళ్లే డొంక రోడ్డులోని మేక అబ్రహం చేపల చెరువు మీద కాపలాదారులుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిల్లలు అక్కడే ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో నాలుగేళ్ల బాలుడు షేక్ నజీర్ బాబు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఇంగిలిపాకలంక విఆర్ఒ సహాయంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చారని పోలీసులు తెలిపారు. విఆర్ఒ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు. బాలునికి శవ పరీక్షలు నిర్వహించి బుధవారం బంధువులకు అప్పగించినట్లు ఎఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లిటిల్‌బడ్స్‌లో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య

స్కూల్ డైరెక్టర్లు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు

మధ్య తరగతి తల్లిదండ్రుల ఆశాసౌధం, సౌలభ్యమైన ఫీజులతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించే ఏకైక విద్యాసంస్థ ఎల్‌బిసి అని స్కూల్ డైరెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ 34 వసంతాల విద్యాప్రస్థానంలో ఎన్నో విజయాలు, దేశ విదేశాల్లో తమ విద్యార్థులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. 1989వ సంవత్సరంలో పడమర వీధి, గంగానమ్మ ఆలయం వద్ద స్కూల్ స్థాపించినట్లు తెలిపారు. 34 విద్యా ప్రస్థానంలో దాదాపుగా 40 వేల మంది విద్యార్థులతో ఎన్నో విజయాలు సాధిస్తూ సంస్థ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. 150 మంది అనుభవజ్ఞులైన సిబ్బందితో విద్యాబోధన చేస్తున్నామన్నారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఆదరాభిమానాలు అందుకుంటున్న హేలాపురి విద్యాశిఖరం లిటిల్ బడ్స్ అని తెలిపారు. వివిధ పోటీ పరీక్షల్లో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎన్నో విజయాలు సాధించారని చెప్పారు. నాడు గ్రేడుల విధానంలో తామే ఫస్ట్, నేడు మార్కుల విధానంలో తామే ఫస్ట్ అని తెలిపారు. 2023 పదో తరగతి ఫలితాల్లో 582 మార్కులు సాధించి ఎల్‌బిసి పేరుప్రఖ్యాతలు రాష్ట్రస్థాయిలో మారుమ్రోగేలా చేశారని తెలిపారు. 550పైగా మార్కులు సాధించినవారు 23 మంది, 500 పైగా మార్కులు సాధించినవారు 55 మంది అని తెలిపారు. పరీక్షలకు హాజరైన ప్రతి ముగ్గురిలో ఒకరు 500పైగా మార్కులు సాధించారన్నారు. లిటిల్‌బడ్స్ స్కూల్, ఎల్‌బిసి ఐసి క్యాంపస్‌లో నర్సరీ నుంచి పదో తరగతి వరకు విజయవంతంగా విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం (ఫైల్)

స్కూల్ ప్రత్యేకతలు

- ఐఎల్ఎం బెంగుళూరువారి సౌజన్యంతో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్‌పై ప్రత్యేక శిక్షణ
- ఆర్ఒఐ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఐఐటిలో శిక్షణ. అస్ట్రాజెన్ వారితో ప్రాథమిక విద్యలో ప్రత్యేక శిక్షణ
- పట్టణ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు అత్యుత్తమ శిక్షణ
- ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎసి, డిజిటల్ స్మార్ట్ క్లాసుల ద్వారా విద్యాబోధన
- స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచడం
- అధునాతన సౌకర్యాలతో ల్యాబ్, లైబ్రరీ
- విద్యార్థుల సమచారం తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేయడానికి టీచ్‌మింట్ సంస్థ ద్వారా వాయిస్ మెసేజ్, టెక్స్ట్ పంపించడం
- శారీరక, మానసిక వికాసం కోసం విశాలమైన ఆటస్థలంలో క్రీడాశిక్షణ
- విద్యార్థులను విజ్ఞాన, క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్లడం
- సోడియం హైపో క్లోరైడ్ ద్రావణంతో తరగతి గదులను శానిటైజేషన్ చేసి క్లాసులు నిర్వహించడం
- చెస్‌పోటీల్లో అత్యుత్తమ శిక్షణ
- వెస్ట్రన్ డ్యాన్స్, యోగాల్లో విద్యార్థులకు శిక్షణ
- విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పాడే జాతీయ నాయకుల జన్మదినాలు, జాతీయ పండుగలు, సైన్స్ డే, మ్యాథ్స్ డే, ఉమెన్స్ డే, గ్రాడ్యుయేషన్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం

హోంగార్డుల ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా ప్రజలకు ఉత్తమ సేవలందించటంలో పోలీసులతో సమానంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని ఎస్‌పి మేరీప్రశాంతి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు హోంగార్డులకు సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయాన్ని చెక్కులుగా ఎస్‌పి అందించారు. హోంగార్డు ఎస్ఎస్.ఫక్రుద్దీన్‌కు రూ.5,54,510, హోంగార్డు జివిఎస్.ప్రసాద్ రూ.5,35,940 చెక్కులు అందించారు.

దిశాయాప్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రతి మహిళ దిశ యాప్ వినియోగంపై అవగాహన పొందాలని డిఎస్‌పి ధనుంజయ్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో దిశా యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో మహిళలకు అవగాహన కల్పిస్తూ వారి సెల్‌ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసినట్లు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో సుమారు వెయ్యి మంది మహిళలకు దిశాయాప్‌పై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని మిట్టగూడెం బృందావన కాలేజ్ ఆఫ్ కామర్స్, ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థులకు రూరల్ సిఐ రాజులపాటి అంకబాబు దిశాయాప్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు దిశ యాప్ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దిశా యాప్ డౌన్‌లోడింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు దిశా యాప్ డౌన్‌లోడింగ్ వల్ల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించామని తెలిపారు. ఈ మేరకు స్పందించిన సుమారు 350 మంది మహిళలు తమ ఫోన్లలో దిశా యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని ఎస్ఐ తెలిపారు.

విత్తన దుకాణాల్లో ఎడిఎ తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వరి రైతులు సార్వా విత్తనాలను అధికారిక దుకాణాల్లో కొనుగోలు చేయాలని కోట రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ పిజి.బుచ్చిబాబు తెలిపారు. మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం గ్రామాల్లో విత్తన షాపులు గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా రైతులకు ఎడి ఎ బుచ్చిబాబు రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఆదికృత డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రైతులు తప్పనిసరిగా వరి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు తీసుకొని జాగ్రత్తపరచాలని తెలిపారు. విత్తనం కొనుగోలు చేసిన ట్యాగ్ తప్పనిసరిగా భద్రపరుచుకోవాలన్నారు. మండలంలో పిఎల్ఎ 1100 832 క్వింటాలు, ఎంటియు 1061 20 క్వింటాలు, సంపత్ స్వర్ణ 18క్వింటాలు, ఎంటియు1064 180 క్వింటాలు, ఎంటియు1224 8 క్వింటాలు, ఎంటియు1318 20 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా మండల వ్యవసాయ అధికారి కెవిఎన్.పోసారావు 14 విత్తన నమూనాలను నాణ్యత పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. మండలంలోని డీలర్లలందరూ తప్పనిసరిగా ఆదికృత పొందిన వరి విత్తనాలను మాత్రమే విక్రయించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎడి ఎ బుచ్చిబాబు హెచ్చరించారు.

'ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలి'

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖలోని ప్రధాన ఆలయాల్లో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు ఉద్యోగ సంఘాల సెక్రటరీ హనుమంతాచార్యులు, ఎఇఒ లక్ష్మణరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో మే 22వ తేదీన సిఎస్‌కు విజయవాడలో వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ద్వారకాతిరుమల ఆలయంలో ఈ నెల 20వ తేదీన అన్ని ప్రధాన ఆలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న దేవాలయాల సిబ్బంది ఈ నెల 19వ తేదీ సాయంత్రానికి ద్వారకా తిరుమల ఆలయానికి చేరుకోవాలని తెలిపారు. వివరాలకు 9440866176, 9030523125 సంప్రదించాలని తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

కైకలూరు :కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశం శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు మంగినేని బాబ్జి తెలిపారు. పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సభ్యులు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకే 'ఆణిముత్యాలు'

ప్రజాశక్తి - పెదపాడు

విద్యారంగంలో అనేక సంస్కరణలను అమలు చేస్తున్న ప్రభుత్వం విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు వేడుకను నిర్వహిస్తుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని సత్యవోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఛైర్‌పర్సన్ నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. దెందులూరు నియోజకవర్గంలో మూడో స్థానంలో ఆణిముత్యంగా నిలిచిన బడి శ్రేష్ఠ అనే విద్యార్థికి ఛైర్‌పర్సన్ నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్లు అందించారు. ఛైర్ పర్సన్ దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, సత్యవోలు గ్రామ ప్రజలు ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బత్తుల రత్నకుమారి యేసురాజు, వైస్ ఎంపిపి రెడ్డి స్వర్ణకుమారి, ఎంపిడిఒ నిర్మల జ్యోతి, ఎంఇఒ, సబితి నరసింహమూర్తి, సత్యవోలు గ్రామ సర్పంచి రంభ ఉమామహేశ్వరి, సకల కొత్తపల్లి సర్పంచి సేపేని రంగారావు, స్కూల్ హెచ్ఎం ఎం.రాధ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ పద్మశ్రీ

నూజివీడు రూరల్ :వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యకు పెద్దపీట వేశామని ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూలులో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం జగన్ గొప్ప విద్యాదాత అని, దూర దృష్టి కలిగిన ముఖ్యమంత్రి అని చెప్పారు. విద్యను అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులన్నీ అందించాలి

వ్యయసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం

ప్రజలతో మాట్లాడుతున్న కొమ్ము ఆనందం

ప్రజాశక్తి - చాట్రాయి

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు తొమ్మిది రకాల రేషన్ సబ్సిడీ సరుకులు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నంపేట గ్రామంలో గురువారం ప్రజా పంపిణీ వాహనం సరుకుల పంపిణీకి రాగా వారిని కొమ్ము ఆనందం సరుకులన్నీ ఇస్తున్నారా అని అడగగా కేవలం బియ్యం మాత్రమే అని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా కొమ్ము ఆనందం మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె, చింతపండు, ఉప్పు, గోధుమపిండి నిత్యావసర సరుకులు పేద ప్రజలకు పంపిణీ చేసేవారన్నారు. ఇప్పుడు బియ్యం మాత్రమే ఇచ్చి మిగిలిన సరుకులన్నీ పేద ప్రజలకు పంపిణీ చేయడం మానేశారని, దీంతో అధిక ధరలతో పేదవాడు నిత్యావసర సరుకులు కొనుక్కోవాలంటే చాలా కష్టంగా ఉందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎండ తీవ్రతకు కూలి పనులకు కూడా వెళ్లలేక కూలీలు గృహాలకే పరిమితమ వుతున్నారన్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లినా నెలల తరబడి కూలి డబ్బులు సకాలంలో కూలీలకు అందటం లేదన్నారు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పేదలకు నిత్యావసర సరుకులన్ని రేషన్ కోట ద్వారా వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజలు రైల్వేట్రాక్ పైకి రావడం చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - మండవల్లి

రైల్వే ట్రాక్ పైకి ప్రజలు రావడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించినవారు ఎంతటి వారైనా శిక్షార్హులవుతారని రైల్వే పోలీస్ భీమవరం శాఖ ఇన్‌స్పెక్టర్ దస్తగిరి స్పష్టం చేశారు. మండవల్లిలో రైల్వే స్థలాలను ఆక్రమించుకుని నిర్మించిన ఇళ్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. రైల్వే ట్రాక్ పైకి ఇతరులు రావడంపై నిషేధం ఉందన్నారు. కేవలం రైల్వే సిబ్బంది మాత్రమే రైల్వే ట్రాక్ పైకి వచ్చేందుకు అనుమతులు ఉన్నాయన్నారు. ఇతరులు అనుమతులు లేకుండా రైల్వే ట్రాక్‌పైకి వస్తే రైల్వే శాఖ చట్టం ప్రకారం సెక్షన్ 147 కింద కేసు నమోదు చేస్తామన్నారు. రైల్వే స్థలాలను ఆక్రమించడం, రైల్వే ట్రాక్ పైకి రావడం రైల్వే స్థలాల్లో, రైల్వే ట్రాక్‌పై ఆటలు ఆడుకోవడం రైల్వే చట్టరీత్యా నేరమని తెలిపారు. రైతులు కూడా పాడి పశువులను రైల్వే ట్రాక్‌పైన, రైల్వే స్థలాల్లో మేపడం కూడా రైల్వే చట్ట ప్రకారం నేరమన్నారు. ప్రమాదం సంభవిస్తే పాడిపశువు చనిపోయిందని రైతు బాధపడతాడని, కాని రైలు బండి కింద పడిన పశువుల కొమ్ముల వల్ల రైలు బండి అదుపుతప్పి పడిపోయే ప్రమాదం ఉందన్నారు. రైలు బండి ప్రమాదానికి గురైతే వేలమంది ప్రయాణికులకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. రైల్వే ట్రాక్ పక్కన పశువులను మేపుతున్నవారిపై రైల్వే చట్ట ప్రకారం సెక్షన్ 153 కింద కేసులు నమోదు చేస్తున్నామని, వారికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని ఆయన వివరించారు. ఇప్పటికే ఇలాంటి చర్యలకు పాల్పడిన ఏడుగురిపై ఈ మధ్యకాలంలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ రైల్వే శాఖ నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ రైల్వే ట్రాక్ పైన, రైల్వే స్థలాల్లో పశువులను మేపకుండా రైల్వే ట్రాక్ పక్కన ఆటలాడకుండా, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు రైల్వే శాఖ తీసుకోనే చర్యలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

జర్నలిస్టులు హక్కుల సాధనకు పోరాడాలి

ప్రజాశక్తి - పోలవరం

జర్నలిస్టుల హక్కుల సాధనకు జర్నలిస్టులందరూ ఐక్యతతో పోరాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక కన్నాపురం అడ్డ రోడ్డు వద్ద ఉన్న కళ్యాణ మండపంలో నిర్వహించిన జర్నలిస్టు ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృత్తిపరంగా ఎదురవుతున్న అన్ని సమస్యలను చాకచక్యంగా అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు. అక్రిడిటేషన్ల విషయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తుందన్నారు. చిన్న పెద్ద తారతమ్యాలు లేకుండా అన్ని పత్రికల జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పలువురు సీనియర్ జర్నలిస్టులకు శాలువవు కప్పి మెమెంటోలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్.శంకరరావు, సీనియర్ జర్నలిస్ట్ అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ కె.బాలసౌరి, సూర్య పత్రిక మేనేజర్ పసుమర్తి రాము, బిసిఎన్ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌కె.షాకీర్ బాబ్జి, కో-ఆర్డినేషన్ సభ్యులు కె.సోమశేఖర్, ఎపిడబ్ల్యుజెఎఫ్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు కె.చిన్నారావు, కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్ సయ్యద్ జబ్బీర్, అనంగా ఛానల్ డైరెక్టర్ బి.ప్రసాద్‌రాజు, పోలవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్ బాబు, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి పాల్గొన్నారు.

మాజీ సర్పంచి పెదబాబుకు మాతృవియోగం

పెదపాడు :మండలంలోని వీరమ్మకుంట గ్రామ మాజీ సర్పంచి, వైసిపి గ్రామ నాయకులు దాసరి పెదబాబు మాతృమూర్తి దాసరి లక్ష్మి (74) మృతి పట్ల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు సంతాసం తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ ఛైర్మన్ కొఠారు రామచంద్రరావు వీరమ్మకుంటలో దాసరి లక్ష్మి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు, ఎంపిపి బత్తుల రత్నకుమారి, బత్తుల ఏసురాజు, దెందులూరు ఎఎంసి ఛైర్మన్ అప్పన ప్రసాద్, స్థానిక నాయకులు మహేష్, రంగయ్య అప్పారావు, ఎంపిటిసి సభ్యులు పి.అప్పలస్వామి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పద్మశ్రీ, ప్రసాదరావు, రామచంద్రరావు

రక్త దాతలకు సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని స్నేహ రైడ్స్ ఆశ్రమంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా గురువారం పది మంది రక్తదాతలను సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఏ విధమైన లాభాపేక్ష లేకుండా రక్త దానం చేస్తూ ప్రాణదాతలుగా ఎదిగిన దాతలందరూ ఆదర్శమూర్తులన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి, ఆశా వర్కర్ నాగమణి, సామాజికవేత్తలు భరణి, రాజు, విలేకరి వెంకటేశ్వరరావులను సన్మానించారు.

మీర్జాపురంలో 'జనభాగీదారి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం గ్రామంలో మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సెక్టార్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి తెలిపారు. గ్రామంలో గురువారం జనభాగీదారి కార్యక్రమం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి

ప్రజాశక్తి - మండవల్లి

అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా చిన్నారులు ఇబ్బందులు పడకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులను ప్రకటించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయన్నారు. జూన్ నెల జరిగిపోతున్నప్పటికీ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టకపోవడంతో తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఇష్టపడడంలేదన్నారు. అంగన్‌వాడీలకు పంపితే తమ చిన్నారుల ఆరోగ్యంపై ఎండ తీవ్రత ప్రభావం చూపుతుందేమోనని చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఉష్ణోగ్రతల కారణంగా పెద్దలే బయటకు రాలేక అల్లాడిపోతున్నారన్నారు. చిన్నారుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీలకు కూడా సెలవులను ప్రకటించాలని ఆయన కోరారు.

జీతాలు పెంచాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని ఎఐటి యుసి నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐటియుసి అనుబంధ రంగం అంగన్‌వాడీ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి సిడిపిఒ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లు పెంచాలని, వైఎస్ఆర్ పోషణ సంపూర్ణ మెనూ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి క్రిస్టియానమ్మ, విమల, రత్నకుమారి, విజయలక్ష్మి, దుర్గ లక్ష్మి, సరోజిని పాల్గొన్నారు.

'టిడిపి విజయానికి కృషి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ నాయకులు గురువారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పదవ తరగతి ఒరిజినల్ మార్కుల లిస్టు పోయినది

ఏలూరు జిల్లా, నూజివీడు డివిజన్, ముసునూరు మండలం, ముసునూరు గ్రామానికి చెందిన గుడివాడ శోభనాచల యోగానంద గుప్త కుమార్తె గుడివాడ నాగ మనోజ్ఞదేవి తమ పదవ తరగతి ఒరిజినల్ మార్కులు లిస్టు పి.పి.నెం. 221058, బియిరింగ్ రోల్ నెం. 1613127595, రెగ్యులర్ ఒరిజినల్ మార్కులు లిస్టు నెం. పి.సి. 13/12363/0221058/జి5 నెంబరు కల్గిన ఒరిజినల్ మార్కులు లిస్టు ముసురూరులో తమ ఇంటి నుండి మీసేవా కేంద్రం వద్దకు వెళ్లి వస్తున్న సమయంలో మార్గమధ్యంలో జారి పోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియచేయగలరు.

గుడివాడ శోభనాచల యోగానంద గుప్త
గుడివాడ నాగ మనోజ్ఞదేవి
ముసునూరు, ఏలూరు జిల్లా.
సెల్: 63023 25693

In the Court of the 3rd Addl. District Judge, West Godavari, Bhimavaram
E.P. 97/2022 in Arbitration Case No. 5/2020

Between:
The Citizen Co-operative Society Ltd., having its Office at 11-7-194, Huda Colony, Saroor Nagar, Hyderabad, rep. by it General Manager. ***...Petitioner/ DHR***
AND
1. Chedella Murali Krishna
2. Chedella Ramesh
...Respondents/ Respondents

To:
1st JDR: Chedalla Murali Krishna, S/o. Koteswara Rao, R/o. D.No. 26-5-25, Kummarla Veedhi, Near Ramalayam, Balusumudi, Bhimavaram, West Godavari District.

పై నెంబరు E.P. లో 1st JDR అయ్యిన మీకు యీ నెంబరు DHR, Sale నోటీస్లు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను జారీ చేయించినప్పటికి 1వ JDR అయ్యిన మీరు సదరు వేలపు నోటీస్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. పై నెంబరు E.P. లో 1వ JDR అయ్యిన మీ హాజరు నిమిత్తం కోర్టు వారు **ది. 11-7-2023వ తేదీకి వాయిదా వేసినారు.** కావున 1వ JDR అయ్యిన మీరు సదరు వాయిదా తేదీ **ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల 1వ JDR అయ్యిన మీ పరోక్షమందు సదరు E.P. గ్రంథము తీర్మానించడమగును.

M.V.V.SIVA SATYANARAYANA
Advocate, Bhimavaram
Cell: 9949345699